దక్కని గౌరవం

- ఎనిమిది నెలల బకాయి రూ.5.96 లక్షలు
- ఎదురుచూస్తున్న సభ్యులు
- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సమస్య



ముస్సిపల్ కార్యాలయం

పెడన: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత క్షేత్రస్థాయిలోని పాలకవర్గాలకు గౌరవ వేతనం నిలిచిపోయింది. ప్రతి మూడు నెలలకు లేదా నాలుగు నెలలకు ఒకసారి అందే పాలకవర్గ సభ్యుల గౌరవవేతనం పెడన పురపాలక సంఘంలోని సభ్యులకు గత ఎనిమిది నెలలుగా అందలేదు. బిల్లులు పంపించినా తిరుగుటపాలో వచ్చేస్తున్నాయి. ఎక్కడ సమస్య ఉందో ఎవరూ సభ్యులకు తెలియజేయడం లేదు.

సందేహాలు ఇవీ..

ఇస్తారో ఇవ్వరో.. అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కారణం రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని, ఇప్పటికే అప్పుల మీద అప్పులు చేస్తున్నారని, తమకు గౌరవవేతనాలు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి ఉందో లేదోననే సందేహాలను కౌన్సిల్ సభ్యులు వ్యక్తం చేస్తుండటం విశేషం.

ఎవరికి ఎంతంటే

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు గౌరవవేతనం రూ.12 వేలు, వైస్ చైర్మన్‌కు రూ.5 వేలు, కౌన్సిల్ సభ్యుడు లేదా సభ్యురాలికి రూ.2,500 చొప్పున నెలకు గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది.

ఎంతమందంటే..

పురపాలక సంఘంలో పాలకవర్గ సభ్యుల సంఖ్యను పరిశీలిస్తే చైర్‌పర్సన్ ఒకరు, వైస్‌చైర్మన్లు ఇద్దరు, కౌన్సిల్ సభ్యులు 18 మంది. వీరు కాకుండా కో ఆప్షన్ సభ్యులు ముగ్గురు ఉన్నారు. పట్టణంలో వార్డుల పరంగా చూస్తే పాలకవర్గ సభ్యుల సంఖ్య 23 మందికి గాను ఇద్దరు మృతి చెందారు. దీంతో రెండు వార్డులు ఖాళీగా ఉన్నాయి. ఎనిమిది నెలలకు గాను వీరందరికీ ఇప్పటి వరకు చెల్లించాల్సిన బకాయిలు రూ.5,96,000 అవుతోంది. ఈ మొత్తం చెల్లించకపోవటంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడ మాత్రమే ఎందుకో..



ప్రతి మూడు నెలలకు లేదా నాలుగు నెలలకు బిల్లులు పంపిస్తారు. ఇలా పంపించిన బిల్లులు వెనక్కు తిరిగి వచ్చాయని, మళ్లీ పంపిస్తున్నామని అధికారులు తెలిపారు. ఎందుకు వెనక్కు పంపించారో కూడా తెలియని పరిస్థితి. మిగిలిన పురపాలక సంఘాల్లో లేని ఇబ్బంది ఇక్కడ మాత్రమే ఉండటం ఏమిటో అర్థం కావడం లేదు. ప్రభుత్వంలో ఎన్డీయే కూటమి వారిది. కావాలని చేస్తున్నారా అనే అనుమానాలు కూడా వస్తున్నాయి. ఎప్పుడు కూడా ఇన్ని నెలలు బకాయిలు లేవు.

– కటకం ప్రసాద్, సీనియర్ కౌన్సిలర్, పురపాలక సంఘం, పెడన

సీఎఫ్ఎంఎస్‌ను ఆధునికీకరించడంతో జాప్యం..



నేను రాక ముందు మార్చి 2025 ఆర్థిక సంవత్సరం చివరలో గౌరవ వేతనాలకు సంబంధించిన బిల్లులు పంపించారు. అప్పటికే నాలుగు నెలలకు సంబంధించినవి పంపించగా సీఎఫ్ఎంఎస్‌ను రాష్ట్రస్థాయిలో ఆధునికీకరించడంతో కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయి. దీంతో బిల్లులు వెనక్కు వచ్చాయి. అప్పటి నుంచి సమస్య ఎక్కడ ఉందో తెలుసుకుని పరిష్కరించడం జరిగింది. రెండు, మూడు రోజుల్లో సభ్యుల గౌరవ వేతనాలు విడుదలయ్యే అవకాశం ఉంది.

– ఎల్.చంద్రశేఖరరెడ్డి, మున్సిపల్ కమిషనర్, పెడన

క్లుప్తంగా

వరి నారు మడుల్లో జింకు ధాతు లోపం



మోపిదేవి: వరి నారు మడుల్లో ఇనుము, జింకు ధాతు లోపాలు గుర్తించామని కేవీకే ఘంటసాల సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి అన్నారు. మోపిదేవిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జింకు ధాతు లోపానికి లీటరు నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఇనుము ధాతు లోపానికి లీటరు నీటికి 20 గ్రాముల అన్నభేది, 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికాకీ చేసుకోవాలన్నారు. మరోసస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి మాట్లాడుతూ ఎలుకల నివారణకు బ్రమోడయోల్ విషపు ఎర తయారీ విధానాన్ని, పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు నాగబాబు, మౌనిక, తేజశ్రీ, యశ్వంత్, నిహారిక పలువురు రైతులు పాల్గొన్నారు.

వర్షంలోనూ ఆగని మట్టి తవ్వకాలు



కోడూరు: వర్షంలో కూడా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండలంలోని విశ్వనాథపల్లి నుంచి సాలెంపాలెం రహదారిలో బుధవారం యథేచ్ఛగా అక్రమ మట్టి రవాణా చేశారు. జేసీబీల సహాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్లలో నల్లమట్టిని ఎత్తుగా వేయడంతో ఆ మట్టి రహదారిపై జారిపడి ప్రమాదభరితంగా మారింది. నల్లమట్టి కావడంతో రహదారులు బురదమయంగా మారి ద్విచక్ర వాహనదారులు రోడ్లపై ప్రయాణించేందుకు నానా ఇక్కట్లు పడ్డారు. ఈ మట్టి కారణంగా పలువురు వాహనాదారులు ప్రమాదాలబారిన పడ్డారు. మట్టి అక్రమ రవాణా గురించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షంలో కూడా మట్టి రవాణా జరుపుతుంటే అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాను నిలుపుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

అవనిగడ్డ: స్థానిక గుర్రపచెరువు వద్ద నిర్మిస్తున్న వాసవీ మాత ఆలయ నిర్మాణ పనులను శాసనసభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఘంటసాల రాజ మోహనరావు (కన్నయ్య)ను ఆలయ నిర్మాణ పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అద్దేపల్లి నాంచారయ్య. నంబూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



మల్లాయి చిట్టూరు(ఘంటసాల): మండలంలో ఉపాధిహామి పథకం నిధులు రూ.2.40 కోట్లతో నిర్మిస్తున్న రెండు తారు రోడ్లు, మల్లాయి చిట్టూరు- పూషడం, పూషడం నుంచి ఎన్‌హెచ్ 216 జాతీయ రహదారి వరకు వెళ్లే ప్రధాన రహదారులకు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలతో కలసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో చేస్తున్నామన్నారు. మల్లాయి చిట్టూరు సర్పంచ్ ఆవుల రేవతి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నందూరి రాజేంద్ర ప్రసాద్ పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ అసంపూర్తిగా ఉన్న ప్రధాన రహదారులతో పాటు మామిడితోటకు వెళ్లే రహదారి కూడా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. యువనేత మండలి వెంకట్రామ్, తుమ్మల చౌదరి బాబు, అయినపూడి భాను ప్రకాష్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సర్పంచులు ముళ్లపూడి పట్టాభి రామారావు, అంకం మారుతీ రావు, నీటి సంఘం అధ్యక్షులు ఆవుల ధర్మ వెంకటనరసయ్య, ఎంపీటీసీలు కుమార్ రాజా, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), ఎంపీడీవో డి.సుబ్బారావు, పీఆర్ డీఈఈ పగడాల సురేష్ బాబు, దిరిశం వెంకట్రావు, కొమ్ము సుందరరావు, కూటమి నేతలు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫోన్లలో యాప్ పనిచేయదు.. ట్యాబ్‌లు ఇవ్వరు

వర్క్ పెండింగ్ పడుతోందని మెప్మా ఆర్పీల ఆందోళన



సీఎంఎం ఆనంద్‌బాబుతో తమ ఇబ్బందులు తెలియజేస్తున్న ఆర్పీలు

పెడన: పురపాలక సంఘంలోని మెప్మా విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆర్పీలు గ్రూపులతో సమావేశాలు నిర్వహించి, ఆ గ్రూపు వివరాలను ఏ రోజుకు ఆ రోజు ఆన్‌లైన్‌లో పొందుపరిస్తేనే వారికి వేతనాలు అందే పరిస్థితి. ఆన్‌లైన్‌లో పొందుపరచకపోతే వేతానాలు అందవు. ఇటువంటి పరిస్థితిలో ప్రస్తుతం ఇప్పటి వరకు సెల్‌ఫోన్లు ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్ చేస్తూ వచ్చిన ఆర్పీలు గత రెండు రోజులుగా సెల్‌ఫోన్లలో యాప్ పని చేయని పరిస్థితి రావడంతో వారంతా మున్సిపల్ కార్యాలయానికి పరుగులు పెట్టారు. సిటీ మిషన్ మేనేజర్ కేఎస్ ఆనంద్‌బాబును కలిసి సెల్‌ఫోన్లలో యాప్ పనిచేయడం లేదని మొరపెట్టుకున్నారు. మిగిలిన మున్సిపాలిటీల్లోనూ, కార్పొరేషన్‌లలో ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్ చేస్తున్నారని, ఇక్కడ కూడా ఆర్పీలకు టాబ్‌లను అందించాలని కోరారు. సీఎంఎం ఆనంద్‌బాబు మాట్లాడుతూ ట్యాబ్‌లను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చేతులమీదుగా అందించాల్సి ఉందన్నారు. ఒకటి, రెండు రోజుల్లో వారిని సంప్రదించి అందించేలా చూస్తానని తెలిపారు. సెల్‌ఫోన్ల ద్వారా ఎందుకు అవ్వడం లేదనే విషయమపై సంబంధిత డేటా ఎంట్రీ వారిని సంప్రదించి తెలియజేస్తామని వారికి చెప్పారు. దీంతో చేసేది లేక వారంతా వెనుదిరిగారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనుల వివరాలను ఫోన్ యాప్‌లో పరిశీలిస్తున్న డైరెక్టర్ రాజాప్రియాసింగ్

పెడన: కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం తీరుపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ రాజాప్రియా సింగ్ బుధవారం మండలంలోని మడక, నందమూరు, పుల్లపాడు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. తొలుత ఆయన మడక గ్రామం ఎస్సీ కాలనీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.6.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు. అనంతరం డ్వాక్రా గ్రూపు మహిళలతో ఇంటరాక్ట్ ఆయ్యారు. తీసుకున్న రుణాలు, చేస్తున్న వ్యాపారం తదితర వివరాలను డీఆర్‌డీఏ పీడీ హరి హరనాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అటవీశాఖ నర్సరీని పరిశీలించారు. మొక్కలను పెంచి నేరుగా మున్సిపాలిటీలకు, ఆయా మండలాలకు పంపిస్తున్నామని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్‌కేవీ కుమార్ వివరించారు. అనంతరం నందమూరులోని గోకులం షెడ్‌ను, హార్టికల్చర్, పుల్లపాడులోని కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఇంటిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. డ్వామా పీడీ శివప్రసాద్, ఎంపీడీవో అరుణకుమారి, డెప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డి, పీఆర్ ఏఈ ధర్మయ్య, హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ పిచ్చిబాబు, ఏఈ వాహెదా, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వాహెద్, మడక, నందమూరు సర్పంచులు జోగి వెంకటలక్ష్మి, పరసా నరసింహారావు, ఆయా సచివాలయాలకు చెందిన ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీల్లో పట్టుబడిన రేషన్ బియ్యం

రైస్‌మిల్, వాహన యజమానులపై కేసుల నమోదు



వ్యానులో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి

గూడూరు: మండలంలో బుధవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుబడింది. మండల పరిధిలోని తరకటూరు శివారు తరకటూరుపాలెంలో ఉన్న గోమతి రైస్ మిల్లులో రేషన్ బియ్యం ఉన్నట్లు పక్కా సమాచారంతో తెల్లవారు ఝామున విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై సాయి కృష్ణ ఆధ్వర్యంలోని బృందం దాడులు నిర్వహించారు. ఆ సమయంలో రైస్ మిల్లు ఆవరణలో మూడు వ్యాన్లలో 221 బస్తాల బియ్యం లోడు ఉండటాన్ని గుర్తించారు. అధికారుల పరిశీలనలో అవి పీడీఎస్ బియ్యంగా అధికారులు నిర్ధారించారు. అయితే వాహనాలు కాటా వేయించుకోవడానికి మిల్లు ఆవరణలోని వేయింగ్ మెషిన్ కోసం వచ్చాయని, వాటికి మిల్లుతో ఎలాంటి సంబంధం లేదని మిల్లు యాజమాన్యం అధికారులతో వాగ్వివాదానికి దిగారు. విజిలెన్స్ అధికారులు లోతుగా విచారణ జరపగా మిల్లులోకి దిగుమతి చేయడానికి వచ్చాయని నిర్ధారణ అయ్యింది. వీటితో పాటుగా మిల్లులో నిల్వ ఉంచిన మరో 55 బస్తాలను పీడీఎస్ బియ్యంగా అధికారులు విచారణలో తేలింది. పట్టుబడిన 258 బస్తాల విలువ రూ.6.21 లక్షలుగా అధికారులు నిర్ధారించారు. పట్టుబడిన బియ్యంతో పాటుగా మూడు వ్యాన్లు, రైస్ మిల్లును సీజ్ చేసినట్లు తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి వెల్లడించారు. వాహన యజమానులు, రైస్ యజమాని జగన్ మోహన్‌రావుపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. తనిఖీలలో పీడీఎస్ డీటీ మస్తాన్‌బీ, గూడూరు ఆర్ఐ ఝాన్సీరాణి, వీఆర్వో కోటేశ్వర రావు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రహదారి మలుపు, వంతెనను ఆనుకుని ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజ్ బాక్స్

కోడూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇండోర్ స్టేడియంకు ఆనుకుని ఉన్న డ్రైన్ పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సిమెంట్ దిమ్మపై ఏర్పాటు చేయగా, ఫ్యూజ్ బాక్స్‌ను పక్కన స్తంభానికి అమర్చారు. ఇది చేతికందే ఎత్తులో ఎంది. ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజ్ బాక్సును మలుపు వద్ద ఏర్పాటు చేశారు. మలుపు తిరిగే సమయంలో ఫ్యూజ్‌బాక్సును ఆనుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి మలు పులో నుంచి ఫ్యూజ్ బాక్సును తొలగించి, ఎత్తులో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేత్ర, శరీర దానం



దోనేపూడి నాగేశ్వరరావు(ఫైల్)

చల్లపల్లి: మండల పరిధిలోని వక్కలగడ్డ గ్రామానికి చెందిన దోనేపూడి నాగేశ్వరరావు (79) మంగళవారం రాత్రి మృతి చెందగా ఆయన శరీరాన్ని, నేత్రాలను వారి కుటుంబ సభ్యులు మెడికల్ కళాశాలలకు దానం చేశారు. బుధవారం విజయవాడకు చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు వచ్చి నేత్రాలను, నిమ్రా మెడికల్ కళాశాల సిబ్బంది వచ్చి మృతదేహాన్ని తీసుకుని వెళ్లారు. మృతి చెందిన నాగేశ్వర రావు కోరిక మేరకే దానం చేసినట్లు ఆయన భార్య నిర్మల, కుమారుడు మహేశ్వరరావు, కుమార్తె రాధిక తెలిపారు. నాగాయలంకకు చెందిన సుదర్శి మానవతా సేవా సంస్థ ద్వారా నాగేశ్వరరావు భౌతికకాయాన్ని దానం చేసినట్లు ఆ సంస్థ సభ్యులు తెలిపారు.

ఎంఈఓ-1గా ముబీన్‌బాను



ఎం.ముబీన్‌బాను

బంటుమిల్లి: ఎంఈఓ-1గా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డాక్టరు ఎం.ముబీన్ బాను సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈమె కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ప్రమోషన్‌పై వచ్చారు. ఇక్కడ ఎంఈఓ-1గా పనిచేసిన స్థానిక ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం బి.త్రిపురసుందరీదేవి ఏలూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఎంఈఓ-1గా బాధ్యతలు తీసుకున్న ముబీన్‌బానును ఎంఈఓ-2 వెంకటేశ్వరరావు, సీఆర్‌పీలు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు కలసి అభినందించారు.

సమ్మె నోటీసు అందజేత



చల్లపల్లి: ఈనెల 9న తలపెట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును వెలుగు ఏపీఎం శ్రీనివాసరావుకు అందజేశారు. బుధవారం సీఐటీయూ మండల శాఖ కార్యదర్శి మహ్మద్ కరిముల్లా, వీఓఏలు, సీసీలతో కలిసి ఈ నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కరీముల్లా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్ వల్ల కార్మికులు తమ హక్కులను కోల్పోవటమే కాకుండా ఉద్యోగ విషయాలపై చట్టపరంగా పోరాడే అవకాశాలను కూడా కోల్పోతారని అన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని కరీముల్లా కోరారు.

పులిగడ్డలో 27 బైక్‌లు, ఒక ఆటో సీజ్



పులిగడ్డ(అవనిగడ్డ): స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిగడ్డ పంచాయతీలో డీఎస్పీ టీ విద్య ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు ఇద్దరు, సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలు, 75 మంది పోలీస్ సిబ్బంది బుధవారం తెల్లవారు జామున 3 గంటల నుంచి ఉదయం ఏడు గంటల వరకూ సెర్చ్ నిర్వహించారు. ప్రత్యేక బృందాలుగా 197 ఇళ్లను తనిఖీ చేశారు. సరైన పత్రాలు చూపకపోవడంతో ఒక ఆటో, 27 బైక్‌లను డీఎస్పీ సీజ్ చేశారు. అనుమానిత వ్యక్తులు ఎవరూ లేరని, శాంతి భద్రతలు పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. ఎవరన్నా కొత్త వ్యక్తులు కనబడినా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ సూచించారు. అవనిగడ్డ, చల్లపల్లి సిఐలు, అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న స్వామీజీ



మోపిదేవిలో స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు అందుకుంటున్న స్వామిజీ సుందర మహరాజ్

మోపిదేవి: కృష్ణాజిల్లా, మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని విజయనగరం జిల్లా, గుర్ల మండలం, గొర్లేపేట శ్రీ సమర్థ గురుసాయి సుందర మహారాజ్ స్వామిజీ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షణచేసిన స్వామిజీ నాగుపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ, మణిదీప్ శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయ సూపరిటెండెంట్ అచ్యుత మదుసూధన రావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

స్వామివారిని దర్శించుకున్న మాజీ మంత్రి మోపిదేవి

మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణారావు బుధవారం మోపిదేవిలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదన రావు స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

అభాగ్యుల సేవకు అంకితమైన రక్షణసైన్యం

ఘనంగా 160వ సంస్థాపన దినోత్సవం



వృద్ధులు, రోగులకు పండ్లు పంచిన రక్షణసైన్యం ప్రతినిధులు

నాగాయలంక: రక్షణసైన్యం (సాల్వేషన్ ఆర్మీ)160వ అంతర్జాతీయ సంస్థాపన దినోత్సవం ఆ సంస్థ నాగాయలంక డీఓ ఆధ్వర్యంలో స్థానిక రాజేశ్వరీకాలనీలోని చర్చి ఆవరణలో బుధవారం ఘనంగా జరిగింది. రక్షణసైన్యం జిల్లా అధికారి (డీఓ) మేజర్ తెలగతోటి ప్రసాదరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో 1865 జూలై 2న సంస్థ ఆవిర్భవించిదన్నారు. మద్రాసు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న తెలుగు గడ్డపై 1895లో విజయవాడలో తొలుత స్టాఫ్ కెప్టెన్ అబ్దుల్ అజీజ్ ఈ సంస్థను ప్రారంభించారని తెలిపారు. ప్రస్తుతం 700 గ్రామాలలో హీనస్థితిలో ఉన్న వేలాది మంది అభాగ్యుల సేవలకు సంస్థ అంకితమై పనిచేస్తోందని వివరించారు. తొలుత ఆయన రక్షణసైన్యం ధ్వజాన్ని ఎగురవేసి, సంస్థ అందిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా వృద్ధులు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. సంస్థ మహిళా విభాగం జిల్లా అధికారి మేజర్ దీనరత్నకుమారి, లెఫ్టినెంట్ డి.అనిల్, లెఫ్టినెంట్ డి.కోటేశ్వరమ్మ, సంఘ పెద్దలు, గృహసమితి సభ్యులు, బాలవీరులు తదితరులు పాల్గొన్నారు.

మహిషాసుర మర్దనికి ఆషాఢ సారె



అమ్మవారికి సమర్పించేందుకు సారెను తీసుకొస్తున్న మహిళలు



కె.కొత్తపాలెంలో దుర్గా అమ్మవారికి సామూహిక కుంకుమార్చలో మహిళలు

మచిలీపట్నంటౌన్: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక గాంధీ బొమ్మ శివాలయంలో శ్రీ మహిషాసుర మర్దని అమ్మవారికి మహిళలు ఆషాఢ సారెను బుధవారం సమర్పించారు. దాదాపు 300 మంది మహిళలు పళ్లాలలో పసుపు, కుంకుమలతో పాటు గాజులు, నూతన వస్త్రాలు, పళ్లు, పువ్వులు, పలు రకాల స్వీట్లు పురవీధుల్లో మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కందుకూరి చిట్టి బాబు, గట్టుపల్లి సాయి చరణ్ శర్మ విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు చేబ్రోలు సాయి రామ్ కుమార్, ఆలయ చైర్మన్ తమ్మన రాధాకృష్ణమూర్తి, సెక్రటరీ ఎండూరి సురేష్, ట్రెజరర్ చేబ్రోలు గాయత్రి, ఆలయ కమిటీ సభ్యులు చేబ్రోలు రాజ సులోచన, బాలాజీ, వాసు, చేబ్రోలు కుమారి తదితరులు పర్యవేక్షించారు.

శ్రీదుర్గమ్మకు ఆషాఢ సారె

కె.కొత్తపాలెం(మోపిదేవి): కృష్ణానది ఒడ్డున కొలువైన శ్రీ దుర్గా కోటేశ్వరస్వామివారి దేవస్థానంలో వారాహి గుప్త నవరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం ఆలయ వ్యవస్థాపకులు రామిశెట్టి నాగరాణి, రామకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని శ్వేత వారాహిగా అలంకరించారు. ఆషాఢ సారె సమర్పించారు. సాయంత్రం పలు గ్రామాల నుంచి వచ్చిన మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాంచారమ్మకు ఆషాఢ సారె సమర్పణ

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి భక్తులు బుధవారం ఆషాఢ సారెను సమర్పించారు. వి.కొత్తపాలెం, విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. పట్టుచీర, గాజులు, పసుపు, కుంకుమతో పాటు వివిధ రకాల పుష్పాలు, పండ్లను అమ్మవారికి సమర్పించి భక్తిభావం చాటుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు ఘంటసాల జైపార్థసారథి అమ్మవారికి మూలమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారి జయశ్రీ, జేఏ సీహెచ్.శివప్రసాద్ పర్యవేక్షించారు.

పొలాలను తలపిస్తున్నగుండేరు డ్రెయిన్

నీరు తొలగించాలని డిమాండ్ చేసిన వైఎస్సార్‌సీపీ నేత ప్రవీణ్, రైతులు



చింతలమడ వంతెన వద్ద గుండేరు డ్రెయిన్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటుకాడ

ఘంటసాల: వర్షాకాలం ప్రారంభమవడంతో పాటు వ్యవసాయ పనులు ప్రారంభించిన నేటికి గుండేరు డ్రెయిన్‌లో తూటికాడ, గుర్రపుడెక్క తొలగించకపోవడం బాధాకరమని వైఎస్సార్ సీపీ నేత వేమూరి ప్రవీణ్, పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఘంటసాల, చల్లపల్లి మండలాల పరిధిలోని గంజి కాలువ, చిల్లలవాగు మురుగు డ్రెయిన్ల నుంచి ప్రవహించే నీరు దేవరకోట సమీపంలోని చింతలమడకు వెళ్లే వంతెన వద్ద గుండేరు మైజరు డ్రెయిన్లు కలుస్తాయి. ఆయా డ్రెయిన్లలో పెద్ద ఎత్తున గుర్రపు డెక్క, తూటుకాడతో కిలోమీటర్ల మేర పేరుకు పోవడంతో మురుగు ప్రవహించే పరిస్థితి లేదన్నారు.

అధికారులు, ప్రభుత్వం గుండేరు డ్రెయిన్లలో గుర్రపు డెక్క, తూటుకాడ తొలగించి, అభివృద్ధి చేసేందుకు లక్షల రూపాయలతో పనులు ప్రారంభించినట్లు ప్రచార ఆర్భాటాల తప్ప క్షేత్రస్థాయిలో కనిపించడం లేదంటూ రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణమే గుండేరుడ్రెయిన్లలో ఉన్న గుర్రపు డెక్క, తూటికాడ తొలగించాలని కోరారు.

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

అవనిగడ్డ: చారిత్రక ప్రసిద్ధి నొందిన స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయ పవిత్రోత్సవాలు ఈనెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ జరుగుతాయని ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతురాజు భాస్కరరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని పూజలందుకోవాలని సూచించారు.